




ములుగు రూరల్ : భూపాల్‌నగర్‌లో పూజలు చేస్తున్న మహిళలు, బీఆర్ఎస్ నాయకులు   గోవిందరావుపేటలో..   ఏటూరునాగారం : శంకరాజుపల్లి బొడ్రాయి వద్ద..   కన్నాయిగూడెం : ముప్పనపల్లి హనుమాన్ ఆలయంలో..

# భారీ మెజార్టీతో నాగజ్యోతిని గెలిపించాలి

- సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలి
- బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు
- బొడ్రాయిలు, ఆలయాల వద్ద పూజలు

ములుగు రూరల్, అక్టోబర్ 28 : ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ మండలంలోని జగ్గన్నపేట, భూపాల్‌నగర్ (పందికుంట) గ్రామాల్లోని బొడ్రాయిల వద్ద మహిళలు, బీఆర్ఎస్ నాయకులు పూజలు చేశారు. భూలక్ష్మి అమ్మవార్లకు కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. జిల్లా పార్టీ ఆదేశాల మేరకు నాయకులు గ్రామాల్లో ఈ కార్యక్రమాలను చేపట్టారు. రానున్న ఎన్నికల్లో నాగజ్యోతి విజయం సాధిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ ఊర విజయలక్ష్మి విష్ణువర్ధన్‌రెడ్డి, భూపాల్‌నగర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్క కుమార్‌యాదవ్, ఉప సర్పంచ్ రాజురెడ్డి, సురేశ్, వెంకన్న, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, వేణు, భద్రయ్య, జగ్గన్నపేట అధ్యక్షుడు గుండెకారి యువరాజు, మద్ది సంపత్, కొడారి సతీశ్, రమేశ్, రాజేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**గోవిందరావుపేటలో..**

గోవిందరావుపేట : ములుగు బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి భారీ మెజార్టీతో గెలవాలని శనివారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సూరపనేని సాయికుమార్ నేతృత్వంలో 18 జీపీల్లో ఆయా గ్రామ కమిటీ అధ్యక్షుల ఆధ్వర్యంలో పోచమ్మ గుడి, బొడ్రాయి, పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ములుగు జిల్లా అభివృద్ధికి కోట్లాది నిధులు వెచ్చించడంతో పాటు సంక్షేమ పథకాలు అందించిన సీఎం కేసీఆర్‌కు బడే నాగజ్యోతి గెలుపును కానుకగా ఇవ్వాలని, నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**ఏటూరునాగారంలో..**

ఏటూరునాగారం : మండల కేంద్రంతో పాటు శంకరాజుపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి అత్యధిక మెజార్టీతో గెలవాలని బీఆర్ఎస్ నాయకులు గ్రామ దేవతలకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, శంకరాజుపల్లిలో గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆత్కూరిరాంబాబు బొడ్రాయి వద్ద కొబ్బరి కాయలు కొట్టి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో ఖాజాపాషా, వలియాబీ, అంతటి విజయ, తుమ్మ మల్లారెడ్డి, సప్పిడి రాంనర్సయ్య, బెడికరమేశ్, కమ్మరి చంద్రబాబు, కాకులమర్రి భాస్కర్‌రావు, జాడి భోజారావు, కాళ్ల రామకృష్ణ, కందకట్ల శ్రీనివాస్, అజ్మత్‌ఖాన్, ముంజ రాజేందర్, అనుము శకుంతల, దేవులపల్లి సమ్మయ్య, నూకల లక్ష్మీనారాయణ, అనుము రమేశ్, రాజేష్, చెన్న శ్రీనివాస్, చామర్తి మనోజ్, తాటిపల్లి సురేశ్, సప్పిడి రాంబాబు, సాయిని లక్ష్మీ నర్సింహయ్య పాల్గొన్నారు.

**తాడ్వాయిలో..**

తాడ్వాయి : ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి భారీ మెజార్టీతో గెలవాలని మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని సమ్మక్క, సారలమ్మ ఆర్చిగేట్ వద్ద గ్రామకమిటీ అధ్యక్షుడు బంగారు సాంబయ్య, బీరెల్లిలో రోషయ్య, మేడారంలో మహేశ్‌తో పాటు పలువురు పూజలు నిర్వహించారు.

**వెంకటాపూర్‌లో..**

వెంకటాపూర్ : బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి గెలవాలని మండలంలోని ప్రతి గ్రామంలో గ్రామ దేవతలు, బొడ్రాయి, ఆలయాల్లో నాయకులు శనివారం పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామ కమిటీల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కన్నాయిగూడెంలో..**

కన్నాయిగూడెం : మండలంలోని ముప్పనపల్లి హనుమాన్ దేవాలయంలో బడే నాగజ్యోతి భారీ మెజార్టీతో గెలుపొందాలని శనివారం యువకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నేరెడ్ల అశోక్, బోనముక్కల కాటంరెడ్డి, సద్దనపు సందీప్, కటకం ప్రశాంత్, నగునూరి హరికృష్ణ, నామని శ్రీరామ్, అరిచర్ల రాజేశ్, కందికట్ల కిరణ్ పాల్గొన్నారు.



గర్భగుడికి తాళం వేసిన అర్చకులు

## రామప్ప ఆలయం మూసివేత

వెంకటాపూర్, అక్టోబర్ 28 : చంద్రగ్రహణం నేపథ్యంలో మండలంలోని రామప్ప దేవాలయాన్ని శనివారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత మూసివేశారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు యథావిధిగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గర్భగుడికి ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ తాళం వేశారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ద్వారం తెరిచి సంప్రోక్షణ, అభిషేకం అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఈవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అవినాష్, మార్క సంతోష్, గుడిమల్ల సంతోష్, దామోదర్, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

**అమెజింగ్ టెంపుల్ రామప్ప**

రామప్పను శనివారం అమెరికాకు చెందిన కొన్రాడ్ సోబోల్వెస్కీ స్టేట్ టూరిస్ట్ గైడ్ వెంకటేశ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ శిల్పకళా ప్రాముఖ్యతను తెలుసుకొని మాట్లాడుతూ కార్వింగ్స్ అద్భుతంగా ఉన్నాయని, ప్రస్తుతం లేటెస్ట్ అనుకునే హైహీల్స్, మినీ స్కర్ట్స్ లాంటి ఫ్యాషన్ అప్పుడే ఉండడం ఆశ్చర్యమేసిందని అన్నారు. అనంతరం రామప్ప సరస్సును సందర్శించారు.

## స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

**ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్**

మంగపేట, అక్టోబర్ 28 : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కమలాపురంలో శనివారం సాయంత్రం పలు వార్డుల్లో మంగపేట పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన కవాతులో ఆయన సీఐ ఎం రాజు, ఎస్సై రవికుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు బలగాలు పలు వీధుల్లో కవాతు నిర్వహించాయి. ప్రజలనుద్దేశించి ఏఎస్పీ మాట్లాడుతూ నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో నచ్చిన వారికి స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసుల సాయం పొందవచ్చన్నారు. 24 గంటల పాటు ప్రజలకు సేవలందించేందుకు తమ బలగాలు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. నగదు, వస్తు రూపంలో ఎవరైనా సరే ప్రజలను ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురి చేస్తే పోలీసులు లేదా స్క్వాడ్‌కు నేరుగా సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ తెలిపారు. కవాతులో పలువురు సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఏటూరునాగారం : మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అంకిత్



తాడ్వాయి : నివాళులర్పిస్తున్న సిబ్బంది

## కొమురం భీంను ఆదర్శంగా తీసుకోవాలి

- ఐటీడీఏ పీవో అంకిత్

ఏటూరునాగారం, అక్టోబర్ 28 : కొమురం భీం పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఐటీడీఏ పీవో అంకిత్ కోరారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న పీవో భీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భీమ్‌ను ఆదివాసీలు గోండు బొబ్బిలిగా పిలుచుకుంటారని, జల్, జంగిల్, జమీన్ నినాదంతో ఉద్యమించి ప్రత్యేక ఆదివాసీ రాజ్యం కోసం పోరాటం చేసినట్టు తెలిపారు. ఐటీడీఏ ద్వారా కల్పిస్తున్న అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో వసంతరావు, డీడీ పోచం, ఏవో దామోదర్‌స్వామి, ఎస్‌వో రాజ్‌కుమార్, జేడీఎం కొండల్‌రావు, పెసా జిల్లా కో ఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

**గిరిజనుల హక్కుల కోసం పోరాటం**

గిరిజన హక్కుల కోసం కొమురం భీం చేసిన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ మిడియం బాపురావు కోరారు. మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో భీమ్ వర్ధంతి సందర్భంగా శనివారం వై జంక్షన్ నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిడం లక్ష్మణ్‌రావు, తోలెం కిష్టయ్య, కోరం చిరంజీవి, దావూద్, వీరబాబు, కృష్ణబాబు, వెంకటేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

**తాడ్వాయిలో..**

తాడ్వాయి : ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు కొమురం భీం వర్ధంతిని మండలంలోని మేడారంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ మ్యూజియంలో అసిస్టెంట్ క్యూరేటర్ కుర్సం రవి ఆధ్వర్యంలో ఆదివాసీలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మ్యూజియం సిబ్బంది, ఆదివాసీలు తదితరులు పాల్గొన్నారు.

## సొంతగూటికి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు




బీఆర్ఎస్‌లో చేరుతున్న ప్రజాప్రతినిధులు

వెంకటాపురం (నూగూరు), అక్టోబర్ 28 : ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మండలానికి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. భద్రాచలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు, వెంకటాపురం మండలాధ్యక్షుడు గంపా రాంబాబు సమక్షంలో పార్టీలో చేరారు. చేరిన వారిలో సర్పంచ్‌లు లాలిబాబు, సమ్మయ్య, సారయ్య ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, డర్రా దామోదర్ పాల్గొన్నారు.

## 8న జడ్పీ సర్వసభ్య సమావేశం

ములుగు రూరల్, అక్టోబర్ 28 : ములుగు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 8న నిర్వహిస్తున్నట్టు సీఈవో ప్రసూనారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయా శాఖల పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

## రాంనగర్‌లో మద్యం షాపు సీజ్

ఏటూరునాగారం, అక్టోబర్ 28 : మండలంలోని రాంనగర్ బాలాజీ వైన్స్‌ను శనివారం సాయంత్రం అధికారులు సీజ్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం బాలాజీ వైన్స్ నుంచి ఇతర మండలాలకు విచ్చలవిడిగా మద్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శరత్‌కు అందగా, ఆయన ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ సీఐ ఫకీరా, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శరత్ తన సిబ్బందితో రాంనగర్‌లోని షాపును తనిఖీ చేసి సీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ఇతర మండలాలకు మద్యాన్ని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## మండలంలో ఇంటింటా జ్వర సర్వే

వెంకటాపురం (నూగూరు), అక్టోబర్ 28 : మండలంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఇంటింటా జ్వర సర్వేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శివాపురం, జక్కులవారివీధి, నాయకులగూడెం కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ఇంట్లో ఉన్న వారితో పాటు జ్వర పీడితులు ఎవరైనా ఉన్నారా? అన్న వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎదిర డాక్టర్ భవ్యశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ

వాజేడు, అక్టోబర్ 28 : మండలంలోని జగన్నాథపురం వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శనివారం వాజేడు ఎస్సై చావాళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు